క్లుప్తంగా

ఈక్రాప్ నమోదు తప్పనిసరి



వెస్ట్‌కోడిపల్లిలో ఈక్రాప్ నమోదు చేస్తున్న వ్యవసాయ సిబ్బంది

బ్రహ్మసముద్రం : ఖరీఫ్‌లో రైతులు సాగు చేసిన వివిధ రకాల పంటలను తప్పనిసరిగా ఈ–క్రాప్ నమోదు చేయించాలని ఏఓ సరిత సూచించారు. సోమవారం మండలంలోని వెస్ట్ కోడిపల్లిలో ఆర్బీకే సిబ్బంది చేస్తున్న ఈ–క్రాప్ నమోదును ఏఓ పరిశీలించారు. అనంతరం ఏఓ మాట్లాడుతూ రైతులు సాగు చేసిన ప్రతి పంటకు ఈ క్రాప్ నమోదు తప్పని సరిగా చేయించుకోవాలన్నారు.

పిల్లలను బడిలో చేర్పించాలి



మాట్లాడుతున్న ఎంపీడీఓ నరసింహమూర్తి

గుమ్మఘట్ట: బడి బయట ఉన్న పిల్లలను బడిలో చేర్పించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఇంచార్జ్ ఎంఈఓ నాగమణి, ఎంపీడీఓ నరసింహమూర్తి తెలిపారు. మండల పరిషత్ కార్యాలయంలో సీఆర్పీలు, వెల్ఫేర్ అసిస్టెంట్లు, గ్రామ వలంటీర్లతో సోమవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండల వ్యాప్తంగా 155 మంది విద్యార్థులు బడి బయట ఉన్నట్లు గుర్తించామని తెలిపారు. గ్రాస్ ఎన్‌రోల్‌మెంట్ రేషియో సర్వేను వేగవంతం చేయాలన్నారు.

నేడు మంత్రి పర్యటన

కంబదూరు: జెల్లిపల్లిలో రాష్ట్ర స్త్రీ,శిశు సంక్షేమ శాఖ మంత్రి ఉషశ్రీచరణ్ మంగళవారం పర్యటించనున్నట్లు వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ బాలరాజు యాదవ్ ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటలకు అర్హులకు పట్టాలు మంత్రి పంపిణీ చేస్తారన్నారు.

డేగ్, కలశం బహూకరణ



డేగ్, కలశాన్ని ఊరేగింపుగా దర్గాకు తరలిస్తున్న సభ్యులు

ఉరవకొండ: జిల్లాలో ప్రసిద్ధిగాంచిన హజరత్ బీబీ జైనబ్బీ అమ్మవారి దర్గాకు రూ.3.50 లక్షల వ్యయంతో ఏర్పాటు చేసిన డేగ్ (భక్తులు దానధర్మాలు, బియ్యం, బేడలు అందించేందుకు ఏర్పాటు చేసిన ఇత్తడి పరికరం) దర్గా శిఖరంపై ఏర్పాటుకు రూ.90 విలువ చేసే కలశాన్ని ఊరేగింపు మధ్య దర్గా కమిటీ సభ్యులు, ముస్లిం సోదరులు సోమవారం దర్గాకు చేర్చారు. దర్గా కమిటీ అధ్యక్షులు హోతురు బాషా మాట్లాడుతూ దర్గా కమిటీ కార్యదర్శి జీఎంఎస్ షాకీర్ తన సొంత డబ్బు రూ. 3.50 లక్షలు వెచ్చించి డేగ్ తయారు చేయించారన్నారు. దర్గా కమిటీ గౌరవ సలహాదారు జాకీర్ రూ.90 వేలతో కలశాన్ని తయారు చేయించారని పేర్కొన్నారు. దాతలను సత్కరించారు.

అడవి జంతువులు కనిపిస్తే సమాచారమివ్వండి



చిరుత స్థావరాలను పరిశీలిస్తున్న దృశ్యం

కళ్యాణదుర్గం: అడవి జంతువులు కనిపిస్తే సంచారం సమాచారం ఇవ్వాలని ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ రాంసింగ్ తెలిపారు. కళ్యాణదుర్గం మున్సిపాలిటీ పరిధిలోని ముదిగల్లులో ఇటీవల చిరుత కనిపించింది. గ్రామస్తులు ఫిర్యాదు చేయడంతో సిబ్బందితో కలిసి ఆయన గ్రామ సమీపంలోని గుట్టలు పరిశీలించారు. పొలాల్లోకి వేకువజామునే వెళ్లే రైతులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

రహదారి పనుల పరిశీలన

వజ్రకరూరు: మండలంలోని పొట్టిపాడు సమీపంలోని హంద్రీనీవా ప్రధాన కాలువ వద్ద పొలాలకు వెళ్లే ప్రాంతంలో రూ.77 లక్షలతో జరుగుతున్న శాశ్వత రోడ్డు పనులను సోమవారం హంద్రీ నీవా ఈఈ రామకృష్ణ యాదవ్ పరిశీలించారు. ఈ పనులు పూర్తయితే రెండు వేల ఎకరాలకు రైతులు రాకపోకలు సాగించవచ్చని ఈఈ తెలిపారు.

చికెన్ సెంటర్‌ను ఢీ కొన్న కారు

కళ్యాణదుర్గం: ముదిగల్లు రోడ్డులోని ఆర్టీటీ కార్యాలయం వద్ద అతివేగంగా వచ్చిన కారు చికెన్ సెంటర్‌లోకి దూసుకెళ్లింది. పట్టణానికి చెందిన ఓ వ్యాపారి కుమారుడు తన స్నేహితులతో కలిసి సోమవారం ఫూటుగా మద్యం సేవించి అతి వేగంగా కారు నడుపుతూ చికెన్ సెంటర్‌ను ఢీ కొట్టాడు. ఆ సమయంలో చికెన్ సెంటర్‌లో ఎవరూలేకపోవడంతో పెనుప్రమాదం తప్పింది. లోపలి వైపు ఉన్న బండలు, వాకిలి సైతం ఎగిరిపడ్డాయి. సుమారు రూ.30 వేలుకు పైగా నష్టం జరిగిందని చికెన్ సెంటర్ నిర్వాహకుడు ఓబిలేశు వాపోయాడు.

పేదలు తలెత్తుకు తిరిగేలా జగన్ పాలన

- ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి



సంక్షేమ పథకాల లబ్ధిని వివరిస్తున్న ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి

రాయదుర్గంటౌన్: కులమతాలు, రాజకీయాలు, అవినీతికి తావులేకుండా సచివాలయాలు, వలంటీర్ వ్యవస్థతో రాష్ట్రంలో పేదరిక నిర్మూలనే లక్ష్యంగా అన్ని వర్గాలకు సంక్షేమ పథకాలు అమలు చేస్తూ పేదలు తలెత్తుకుని తిరిగే పరిస్థితిని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కల్పించారని ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి పేర్కొన్నారు. సోమవారం పట్టణంలోని 17వ వార్డులో మున్సిపల్ చైర్‌పర్సన్ పొరాళ్ల శిల్ప, వైస్ చైర్మన్‌లు శ్రీనివాసయాదవ్, వలిబాషా, వార్డు కౌన్సిలర్ తాశ సాబిరాబీ, కమిషనర్ దివాకర్‌రెడ్డి, వార్డు ఇన్‌చార్జ్ బషీర్ అహ్మద్, సచివాలయ సిబ్బంది, వలంటీర్లతో కలిసి ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి పర్యటించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పట్టణంలోని 18 సచివాలయాల పరిధిలో గల 32 వార్డుల్లోని 18,258 గడపలు పూర్తి చేసినట్లు చెప్పారు. ఒక్కో సచివాలయానికి రూ.20 లక్షల చొప్పున మంజూరైన రూ.3.65 కోట్లతో ఇప్పటికే అభివృద్ధి పనులు పూర్తి కాగా, మరికొన్ని జరుగుతున్నట్లు చెప్పారు. పేదల సంక్షేమం కోసం పాటుపడుతున్న సీఎం వైఎస్ జగన్‌ను మరోసారి ఆశీర్వదించాలని కోరారు. గడప గడపకు కార్యక్రమం ముగింపును పురస్కరించుకుని ప్రజలతో కలిసి కేక్‌కట్ చేసి విప్ ఆనందాన్ని పంచుకున్నారు. ప్రజల ఆనందం, సంతోషం చంద్రబాబుకు ఏమాత్రం కనిపించడం లేదని, కేవలం అధికారంలోకి వచ్చి దోచుకోవడానికే ప్రభుత్వంపై విష ప్రచారం చేస్తున్నారంటూ విప్ ధ్వజమెత్తారు.

రూ.16 లక్షలతో డ్రైనేజీ నిర్మాణం

శ్రీవెంకటేశ్వర కాలనీవాసులు దశాబ్దాలుగా ఎదుర్కొంటున్న డ్రైనేజీ సమస్య తీరనుంది. ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి ఇచ్చిన మాట మేరకు సమస్య పరిష్కారానికి చర్యలు చేపట్టారు. రూ.16 లక్షల మున్సిపల్ జనరల్ ఫండ్స్‌ను మంజూరు చేయించారు. సోమవారం కాలనీ పరిధిలోని అజాద్ స్కూల్ వద్ద మున్సిపల్ చైర్‌పర్సన్ పొరాళ్ల శిల్ప, వార్డు కౌన్సిలర్ తాశ సాబిరాబీ, మున్సిపల్ కమిషనర్ దివాకర్‌రెడ్డితో కలిసి భూమి పూజ చేసి పనులను లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అభివృద్ధి పనుల విషయంలో రాజీ పడే ప్రసక్తే లేదన్నారు. టీడీపీ హయాంలో దాదాపు రూ.30 కోట్ల విద్యుత్ బకాయి పెడితే,దాన్ని చెల్లించుకుని తాగునీటి కోసం కరెంటు సరఫరాను కాపాడుకోవాల్సి వచ్చిందన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్లు శ్రీనివాసయాదవ్, వలిబాషా, పట్టణ కన్వీనర్ ముస్తాక్, కాంట్రాక్టర్ సత్యనారాయణరెడ్డి, కౌన్సిలర్లు గోవిందరాజులు, శ్రీలక్ష్మీ, శ్రీనివాసరెడ్డి, పైతోట సంజీవప్ప, ఫక్రుద్దీన్, వార్డు ఇన్‌చార్జ్‌లు పొరాళ్ల శివకుమార్, బషీర్ అహ్మద్, శివప్ప, గోరంట్ల సత్యనారాయణ, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

గడప గడపలో అపూర్వ స్వాగతం

ఉరవకొండ: ఎమ్మెల్యే పయ్యావుల కేశవ్ సొంత పంచాయతీ కొకుంట్ల–2 సచివాలయ పరిధిలోని వై.రాంపురం గ్రామంలో సోమవారం నిర్వహించిన గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమానికి గ్రామస్తుల నుంచి స్పందన లభించింది. ముందుగా ఎర్రిస్వామి తాత ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డి గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం చేపట్టారు. మహిళలు హారతులు పట్టి పూల వర్షం కురిపిస్తూ ఆయనకు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి సంక్షేమ లబ్ధిని వివరించారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో తమకు సంక్షేమ పథకాల ద్వారా లక్షలాది రూపాయల లబ్ధి చేకురిందని గ్రామస్తులు ఆనందం వ్యక్తం చేశారు. వచ్చే ఎన్నికల్లో ప్రభుత్వానికి తాము పూర్తి మద్దతు ఇచ్చి గెలిపించుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో ఉరవకొండ, కూడేరు ఎంపీపీలు చంద్రమ్మ, నారాయణరెడ్డి, వైస్ ఎంపీపీ నరసింహులు, జెడ్పీటీసీ ఏసీ పార్వతమ్మ, మార్కెట్‌యార్డు చైర్మన్, వైస్ చైర్మన్లు సుశీలమ్మ, సుంకన్న, పెన్నహోబిలం ఆలయ మాజీ చైర్మన్ అశోక్, కమ్మ, కురుబ, వాల్మీకి కార్పొరేషన్ డైరెక్టర్లు తేజోనాథ్, గోవిందు, దుద్దేకుంట రామాంజినేయులు తదితరులు పాల్గొన్నారు.



సంక్షేమ బుక్‌లెట్ అందజేస్తున్న మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డి

'నా మట్టి- నాదేశం' మహోన్నతం

- ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి



పంచప్రాణ ప్రతిజ్ఞ చేస్తున్న విప్ కాపు రామచంద్రారెడ్డి

రాయదుర్గం: జన్మనిచ్చిన తల్లిని, స్వేచ్ఛగా జీవించేందుకు అవకాశం కల్పించిన దేశాన్ని గౌరవించుకునేలా చేపట్టిన నా మట్టి– నాదేశం కార్యక్రమం మహోన్నతమైనదని రాష్ట్ర ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి పేర్కొన్నారు. పట్టణంలోని మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో సోమవారం కళ్యాణదుర్గం డీఎల్‌డీఓ శంకర్, డ్వామా ఏపీడీ జయకుమార్‌బాబు ఆధ్వర్యంలో నియోజకవర్గస్థాయి అధికారులు, ప్రజాప్రతినిధులతో కలసి ఆజాదీకా అమృత్ మహోత్సవాల్లో భాగంగా శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ పొరాళ్ల శిల్ప, ఎంపీపీ విద్యావతి, కమిషనర్ దివాకర్‌రెడ్డి, ఎంపీడీఓ కొండన్న, తహసీల్దార్ మారుతి, సర్పంచులు, ఎంపీటీసీలు, అధికారులతో కలసి మొక్కలు నాటారు. మట్టి కుండలను చేతిలో పట్టుకుని పంచప్రాణ ప్రతిజ్ఞతో పాటు అమరులకు జ్యోతి ప్రజ్వలనతో వందన సమర్పణ చేశారు. ఈ సందర్భంగా విప్ కాపు మాట్లాడుతూ భారతదేశం వైపు ప్రపంచ దేశాలు చూస్తున్నాయని తెలిపారు. గాంధీజీ గ్రామ స్వరాజ్య కలను ఏపీలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సాకారం చేశారని ఆయన కొనియడారు. విద్యలో విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుట్టారని పేర్కొన్నారు. అధికారం కోసం టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు ఎంతకైనా దిగజారి పోతాడని విమర్శించారు. కార్యక్రమంలో ఆయా మండలాల ఈఓఆర్డీలు, రెవెన్యూ అధికారులు, సర్పంచులు, ఎంపీటీసీలు, పంచాయతీ అధికారులు పాల్గొన్నారు.

యువతకు ఉచిత శిక్షణ

కళ్యాణదుర్గం: నిరుద్యోగ యువతకు ఉన్నతి ఫౌండేషన్ ఆధ్వర్యంలో యువతకు వైఎస్సార్ కడపలో ఉచితంగా శిక్షణ ఇస్తున్నట్లు ఫౌండేషన్ అడ్మిషన్స్ కోఆర్డినేటర్ హరిప్రసాద్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ట్యాలీ, జీఎస్టీ, కంప్యూటర్ కోర్సుల్లో శిక్షణ ఇవ్వనున్నట్లు ఆయన తెలిపారు. పదో తరగతి, ఇంటర్ ఐటీఐ, డిప్లమా, డిగ్రీ పాస్/ఫెయిల్ అయిన వారు, 18–26 లోపు వయస్సు ఉన్నవారు అర్హులన్నారు. 35 రోజుల పాటు శిక్షణ ఉంటుందని, అభ్యర్థులకు ఉచిత భోజన వసతి కల్పించనున్నట్లు తెలిపారు. వివరాలకు సెల్: 9000487423లో సంప్రదించాలన్నారు.

నాడు - నేడు పనుల పరిశీలన

శెట్టూరు: మండలంలోని అడవిగొల్లపల్లి, చిన్నంపల్లి గ్రామాల్లోని పాఠశాలల్లో జరుగుతున్న నాడు – నేడు పనులను ఎంఈఓ శ్రీధర్ పరిశీలించారు. పనుల్లో నాణ్యత పాటించాలని, వేగంగా పనులు పూర్తి చేయాలని సూచించారు. పాఠశాలలో విద్యర్థుల, ఉపాధ్యాయుల హాజరును పరిశీలించారు. విద్యార్థులు రోజు పాఠశాలకు హాజరయ్యేలా ఉపాధ్యాయులు చర్యలు తీసుకోవాలన్నారు.

రోడ్డు నిర్మాణ పనులు..

కుందుర్పి: జంబుగుంపల పంచాయతీ కలిగొలిమిలో ఎంపీపీ కమలమ్మ, సర్పంచు గంగాధర్ తదితరులు రూ.4లక్షలతో సిమెంట్ రోడ్డు పనులను సోమవారం ప్రారంభించారు. వైఎస్సార్‌సీపీ నాయకుడు, మాజీ డీలర్ గోవిందప్ప, మెంబర్లు సుశీల, నాగభూషణ, పూజారి ఓబుళేసు, రవి, గోపాల్, ఓబన్న, మారెప్ప తదితరులు పాల్గొన్నారు.

నేడు కృష్ణాజలాలకు పూజలు

వజ్రకరూరు: రాగులపాడు ఎత్తిపోతల పథకం (లిఫ్ట్) వద్ద కృష్ణాజలాలకు మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు ఎంపీపీ రమావత్ దేవి, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు కమలపాడు వెంకటరెడ్డి తెలిపారు. ముఖ్యఅతిథిగా మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి హాజరవుతారన్నారు.

సరిహద్దు ప్రాంతంలో పటిష్ట నిఘా



పాల్తూరు పోలీస్‌స్టేషన్ పరిసరాలు పరిశీలిస్తున్న డీఎస్పీ నరసింగప్ప

విడపనకల్లు: మండల పరిధిలోని పాల్తూరు పోలీస్‌స్టేషన్‌ను సోమవారం గుంతకల్లు డీఎస్పీ నరసింగప్ప తనిఖీ చేశారు. పాల్తూరు పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఉన్న గ్రామాల్లో ఉన్న సమస్యలపై ఆరా తీశారు. కర్ణాటక రాష్ట్రం సరిహద్దులో ఉన్నందును పటిష్ట నిఘా ఏర్పాటు చేయాలని పోలీసు సిబ్బందిని ఆదేశించారు. అనంతరం పోలీస్‌స్టేషన్ పరిసరాలను పరిశీలించి రికార్డులు తనిఖీ చేశారు.

ఆలయంలో పూజలు

ఉండబండ వీరభద్రస్వామి దేవాలయంలో సోమవారం గుంతకల్లు డీఎస్పీ నరసింగప్ప, ఉరవకొండ రూరల్ సీఐ శేఖర్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. బ్రహోత్సవాల్లో భాగంగా వారు ప్రత్యేక దర్శనం చేసుకొని స్వామికి మొక్కులు చెల్లించుకున్నారు.

అధికారులు సమయపాలన పాటించాలి



మాట్లాడుతున్న ఎంపీపీ పద్మ

బొమ్మనహాళ్: మండల సర్వసభ్య సమావేశానికి అధికారులు సమయానికి రావడం లేదని ఎంపీపీ యు.పద్మ అన్నారు. సోమవారం ఎంపీపీ అధ్యక్షతన సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వారం క్రితమే సర్క్యులర్ పంపించినా అధిక శాతం మంది అధికారులు 12 గంటల వరకు కూడా హాజరుకాకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇకపై అలా జరగకుండా సమయపాలన తప్పనిసరిగా పాటించాలని సూచించారు. వివిధ దశల్లో ఉన్న గ్రామ సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌లను సెప్టెంబర్ చివరిలోగా పూర్తి చేయాలన్నారు. గ్రామాల్లో డ్రైనేజీలు శుభ్రం చేయాలన్నారు. ప్రభుత్వ భవనాలు, సీసీ రోడ్ల నిర్మాణానికి ఇసుక సమస్య ఎక్కువగా ఉందని, రీచ్ ఏర్పాటు చేయాలని సర్పంచ్‌లు యోగేశ్వరరెడ్డి, పరమేశ్వర తెలిపారు. నూతనంగా వచ్చిన ప్రధానోపాధ్యాయులకుపాఠశాలల్లో నాడు–నేడు పనులను బాధ్యతలు ఇస్తే పనులు ప్రారంభిస్తారని పేర్కొన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీనివాసులు, కోఆప్షన్ మెంబర్ మాబుసాబ్, పశువైద్యాధికారి వెంకట్‌రెడ్డి, ఏఈ లక్ష్మిరెడ్డి, వైద్యాధికారి శ్రీలక్ష్మి, వివిధ శాఖల అధికారులు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

షేర్ క్యాపిటల్ పెంచేందుకు గడువు పొడిగింపు



మాట్లాడుతున్న టౌన్‌బ్యాంకు పాలకవర్గ సభ్యులు

ఉరవకొండ: మూత పడే దిశగా ఉన్న ఉరవకొండ కోఆపరేటివ్ టౌన్ బ్యాంకు షేర్ క్యాపిటల్ పెంచుకోవడానికి రిజర్వు బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) మరో మూడు నెలల గడువు పొడిగిస్తూ ఉత్తర్వులు జారీ చేసినట్లు బ్యాంకు పాలకవర్గం తెలిపింది. స్థానిక గాంధీచౌక్ వద్ద ఉన్న టౌన్‌బ్యాంకు సమావేశ భవనంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పాలకవర్గ అధ్యక్షులు సాధు కుళ్లాయిస్వామి, ఉపాధ్యక్షులు చెంగలమహేశ్వర, డైరెక్టర్లు మైనుద్దీన్, నాగరాజు, పెద్దకోట్ల రమేష్, ప్రమీణ్‌కుమార్, పెద్దకోట్ల శ్రీనివాసులు, బ్యాంకు సీఈఓ కరణం వేదమూర్తి పాల్గొన్నారు. కుళ్లాయిస్వామి మాట్లాడుతూ టౌన్ బ్యాంకు షేర్ క్యాపిటల్ పెంచుకోవడానికి ఇచ్చిన ఆరు నెలల గడువు ఈనెల 24తో ముగియనుందని, ఇప్పటి వరకు కేవలం రూ.15 లక్షల మాత్రమే క్యాపిటల్ వసూలు చేశామన్నారు. ఆర్‌బీఐ మరో మూడు నెలల గడువు ఇస్తు రెండు రోజుల క్రితం ఉత్తర్వులు జారీ చేసిందన్నారు. రూ.1.2 కోట్ల షేర్ క్యాపిటల్ వసూలు చేసుకుంటే తిరిగి బ్యాంకు కార్యకలపాలు కొనసాగుతాయన్నారు. ఖాతాదారులు దీన్ని గమనించి సహకరించాలన్నారు.

భక్తిశ్రద్ధలతో నాగుల చవితి వేడుకలు



అక్కమాంబ ఆలయంలో రాతి గుండుపై వెలసిన నాగులకు పూజలు చేస్తున్న మహిళలు

కళ్యాణదుర్గం: పట్టణంలో భక్తిశ్రద్ధలతో నాగులచవితి పూజలు నిర్వహించారు. అక్కమాంబ ఆలయంలో రాతి గుండుపై వెలసిన నాగుల విగ్రహాలకు మహిళలు ప్రత్యేకంగా అలంకరించి, పాలు పోసి పూజలు చేశారు. శ్రావణ మాసం సందర్భంగా వచ్చిన భక్తులకు పలువురు అన్నదానం చేశారు. భక్తులకు ఆలయ కమిటీ నూతన చైర్మన్ రాము, వైస్ చైర్మన్ నాగిరెడ్డి ఏర్పాట్లు చేశారు.

సంక్షిప్త సమాచారం

పోస్టర్ల విడుదల

రాయదుర్గంటౌన్: జిల్లాలో విద్యారంగ సమస్యల పరిష్కారానికి ఆగస్టు 23 నుంచి 30 వరకూ చేపట్టనున్న విద్యార్థి సంగ్రామ సైకిల్‌యాత్రను జయప్రదం చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు బంగి శివ పిలుపునిచ్చారు. సోమవారం పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణంలో సైకిల్‌యాత్ర పోస్టర్లను విడుదల చేశారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ రాయదుర్గం నాయకులు హరి, లోకేష్, వీరేష్, ప్రేమ్ జోసఫ్ తదితరులు పాల్గొన్నారు.

సాగు హక్కు పత్రాల అందజేత

కుందుర్పి: తూముకుంట హరిరేశ్వరస్వామి ఆలయ మాన్యం భూమి 76 ఎకరాలు అర్చకులే సాగు చేసుకునేలా హక్కుపత్రాలను జెడ్పీటీసీ సభ్యుడు రాధాస్వామి, ఎంపీటీసీ సభ్యుడు బసవరాజు తదితరులు సోమవారం అందించారు. అర్చకులు ఓబులప్ప, కృష్ణమూర్తి, సత్యన్న, గోపాల్ తదితరులకు తాత్కాలిక సాగుహక్కు పత్రాలు అందించినట్లు తెలిపారు.

సబ్సిడీ బియ్యం పట్టివేత

కంబదూరు:అక్రమంగా తరలిస్తున్న సబ్సిడీ బియ్యాన్ని పోలీసులు పట్టుకున్నారు. సోమవారం కణేకల్‌కు చెందిన సద్దాం అనే వ్యక్తి ఆటోలో కళ్యాణదుర్గం నుంచి కర్ణాటకకు తరలిస్తుండగా కంబదూరు చెక్‌పోస్టు వద్ద 25 ప్యాకెట్ల సబ్సిడీ బియ్యం పట్టుకున్నారు. ఆటోను స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేశారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

కళ్యాణదుర్గం: కళ్యాణదుర్గం– గరుడాపురం మధ్య సోమవారం రోడ్డు ప్రమాదం జరిగింది. గరుడాపురం వద్ద కళ్యాణదుర్గం వైపు నుంచి ఎదురెదురుగా వస్తున్న రెండు బైకులు ఢీ కొన్నాయి. విజయవాడ ప్రాంతానికి చెందిన ఓ యువకుడికి తీవ్ర గాయాలయ్యాయి.

చిన్నారికి డెంగీ లక్షణాలు

బొమ్మనహాళ్: శ్రీధరఘట్ట గ్రామంలో ఏడాది వయసున్న చిన్నారికి డెంగీ లక్షణాలు కనిపించాయి. బళ్లారిలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించి వైద్య పరీక్షలు చేయించారు. డెంగీ లక్షణాలు ఉన్నట్లు వైద్యులు తెలిపారని చిన్నారి త్రిశీక తండ్రి ప్రభాకర్ తెలిపారు.

అవార్డు గ్రహీతకు సన్మానం

కణేకల్లు: ఆయకట్టు రైతులకు సక్రమంగా సాగు నీరందించే విషయంలో జేఈ అల్తాఫ్ కృషి ప్రసంశనీయమని స్థానిక హెచ్చెల్సీ సబ్‌డివిజన్ డీఈఈ మద్దిలేటి పేర్కొన్నారు. పంద్రాగస్టు వేడుకల్లో జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, కలెక్టర్ గౌతమి చేతుల మీదుగా జేఈ ఉత్తమ అవార్డును అందుకొన్న విషయం విదితమే. ఈ నేపథ్యంలో స్థానిక హెచ్చెల్సీ కార్యాలయంలో సోమవారం ఆయనను డీఈఈ, ఏఈఈ గోపాల్‌నాయక్, సీనియర్ అసిస్టెంట్ ఫరూక్, సిబ్బంది, లస్కర్లు సన్మానించారు.

హాస్టల్ స్థలాన్ని కాపాడండి

విడపనకల్లు: ఉరవకొండ గాంధీ హరిజన హాస్టల్ స్థలం అన్యాక్రాంతం కాకుండా కాపాడాలని వివిధ సంఘాల నాయకులు జేసీ కేతన్‌గార్గ్‌ను కోరారు. అనంతపురంలోని కలెక్టర్ కార్యాలయంలో జేసీని కలిసి సమస్యను వివరించారు. ఎస్సీ, ఎస్టీ జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు సాకే హరి, డీజీహెచ్ఎస్ఎస్ జాతీయ అధ్యక్షుడు మీనుగ గోపాల్, గాంధీ హరిజన హాస్టల్ కమిటీ సభ్యులు ఆనందురాజు, సుంకన్న, ఎంఎస్ వెంకటేశులు, మోపిడి వన్నూరుస్వామి తదితరులున్నారు.

వర్షం కోసం పూజలు

విడపనకల్లు: పెద్ద కొట్టాలపల్లిలో సోమవారం వైస్ ఎంపీపీ సునీతరాణి, సర్పంచు మోదుపల్లి రామాంజినేయులు ఆధ్వర్యంలో గ్రామస్తులు వర్షం కోసం శివాలయంలో పూజలు చేశారు. అంతకు ముందు గ్రామస్తులు నిండు బిందెలతో ఊరేగింపుగా వచ్చి శివాలయంలో స్వామివారికి జలాభిషేకం నిర్వహించారు. అన్నదానం నిర్వహించారు.

కళ్యాణదుర్గం: పట్టణంలోని కోటవీధి రామాలయం, శివాలయాల్లో వర్షం కోసం భక్తులు పూజలు జరిపారు. ఊరి బొడ్రాయికి 1001 బిందెల నీటిని పోసి అభిషేకం చేశారు. శ్రీరాముడి చిత్రపటంతో మేళ, తాళాల మధ్య ఊరేగింపుగా ఊరి చెరువుకు చేరుకొని గంగమ్మ తల్లికి పూజలు చేశారు. పూజల్లో గుళ్లో రామన్న, బారకాయల కృష్ణ, రామాంజనేయులు, బొజ్జన్న, రైతులు ఉన్నారు.

యాజమాన్య పద్ధతులతో మేలైన దిగుబడి

కణేకల్లు: వరిలో యాజమాన్య పద్ధతులు పాటిస్తే మేలైన దిగుబడి పొందడం సాధ్యమని అనంతపురం డీఆర్సీ పీడీ మద్దిలేటి రైతులకు సూచించారు. మండలంలోని బ్రహ్మసముద్రం ఆర్బీకేలో సోమవారం గ్రామీణ విత్తనోత్పత్తి కింద ఎంపికై న రైతులకు వరిసాగుపై శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా పీడీ మాట్లాడారు. ఆకుల కొనలను తుంచి నాట్లు వేయాలన్నారు. ఒక చదరపు మీటరుకు 33 నారు కుదులు ఉండేలా చూసుకోవాలన్నారు. తూర్పు, పడమర దిశలో 2 మీటర్లకు తప్పనిసరిగా కాలిబాటలు ఏర్పాటు చేసుకోవాలని, మురుగునీరు లేకుండా చూడాలన్నారు. సమావేశంలో రాయదుర్గం ఏడీఏ లక్ష్మానాయక్, డీఆర్సీ ఏడీఏ శైలజ, ఏఓ శ్రీనివాసులు, కణేకల్లు ఏఓ శ్రవణ్‌కుమార్, సర్పంచు కురుబ వన్నప్ప తదితరులు పాల్గొన్నారు.

పరమేశ్వరా.. పాహిమాం



పూజలందుకున్న నీలకంఠేశ్వరుడు



అలంకరణలో తాళ్లకెర వీరభద్రేశ్వర స్వామి



పూజలందుకున్న భక్త మార్కండేయుడు



జోడు లింగాలకు ప్రత్యేక పూజలు

రాయదుర్గం: నియోజకవర్గంలోని ప్రసిద్ధి చెందిన శైవ క్షేత్రాలు శ్రావణశోభ సంతరించుకున్నాయి. తొలి సోమవారం కావడంతో మహిళలు అధిక సంఖ్యలో ఆలయాలకు తరలివచ్చి భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. పట్టణంలోని బళ్లారి రోడ్డులో కొలువుదీరిన నీలకంఠేశ్వరుడు, భక్త మార్కండేయుడు, హాళకేశ్వరుడు, జంబుకేశ్వరుడి ఆలయాల్లో శివనామస్మరణతో భక్తులు మార్మోగించారు. గుమ్మఘట్ట మండలంలోని తాళ్లకెరలో ప్రసిద్ధి చెందిన వీరభద్రేశ్వర ఆలయంలో పూజలను ఉదయం నుంచి రాత్రి వరకూ కొనసాగించారు. ప్రత్యేక ప్రార్థనలు, కుంకుమార్చన, రుద్రాభిషేకం నిర్వహించారు. ప్రసాదాలు, అన్నదానాలు చేపట్టారు.

జోడు లింగాలకు ప్రత్యేక పూజలు

కూడేరు: మండల కేంద్రంలోని శివపార్వతుల జోడు లింగాల సంగమేశ్వర స్వామి ఆలయానికి సోమవారం జిల్లా నలుమూలల నుంచి భక్తులు పోటెత్తారు. ఆలయ అర్చకులు శివశంకర్ శాస్త్రి, మహేష్, శివ స్వాములు జోడు లింగాలకు ప్రత్యేక పూజలు చేశారు.

ఉద్యోగులను క్రమబద్ధీకరించాలి

కూడేరు: సమగ్ర శిక్ష ఉద్యోగులను క్రమబద్ధీకరించాలని మండల సీఆర్పీలు వెంకటరమణ, శివప్రసాద్, ఆదిలక్ష్మీ, ఎంఆర్సీ సిబ్బంది ఆంజనేయులు, ఆదాంబీ, సుజాతలు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు వారు సోమవారం కూడేరులోని ఎమ్మార్సీ సెంటర్ ముందు నిరసన తెలిపారు.

స్టార్టర్ పెట్టె అపహరణ

కూడేరు: మండల పరిధిలోని ముద్దలాపురానికి చెందిన రైతు రామ్మోహన్ పొలంలో ఆదివారం రాత్రి దుండగులు రెండు స్టార్టర్ పెట్టెలను ఎత్తుకెళ్లేందుకు ప్రయత్నించారు. అయితే ఒకదానికి కరెంట్ సరఫరా కావడంతో దాన్ని వదిలేసి, ఒకటి తీసుకెళ్లారు. గేట్ వాల్వ్‌ను ఎత్తుకెళ్లేందుకు పైపులను ధ్వంసం చేశారు. సోమవారం బాధిత రైతు కూడేరు పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

'డిమాండ్లు పరిష్కరించాకే విధుల్లోకి'

కూడేరు: తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాకే విధుల్లోకి చేరుతామని కూడేరు మండల పరిధిలోని పీఏబీఆర్ డ్యాంలో ఏర్పాటు చేసిన శ్రీరామిరెడ్డి తాగునీటి ప్రాజెక్టులో పని చేస్తున్న కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు నాగరాజు తెలిపారు. ప్రాజెక్ట్ పరిధిలో 600 కార్మికులు పని చేస్తున్నామన్నారు. 850 గ్రామాలకు తాగునీరు సరఫరావుతుందన్నారు. పెండింగ్‌లో ఉన్న 4 వేతనాలను, పీఎఫ్‌ను, ఈఎస్ఐని చెల్లించాలని డిమాండ్ చేశారు.

శ్మశాన వాటికకు స్థలం కేటాయించండి

కంబదూరు: మండలంలోని ఒంటారెడ్డిపల్లిలో శ్మశాన వాటికకు స్థలం కేటాయించాలని ఎస్సీ,ఎస్టీ జేఏసీ సంఘాల నాయకులు కోరారు. సోమవారం ఎస్సీ,ఎస్టీ జేఏసీ మండల అధ్యక్షుడు, ఎరుకల సంఘం అధ్యక్షుడు సుబ్బరాయుడు, ప్రధాన కార్యదర్శి నాగరాజు తహసీల్దార్ నయాజ్ అహ్మద్‌ను కలిసి వినతిపత్రం అందించారు.

23న అర్బన్ హెల్త్ క్లినిక్‌ల ప్రారంభోత్సవం

కళ్యాణదుర్గం: ఇందిరమ్మ కాలనీ, కురాకులతోటలలో ప్రభుత్వం నూతనంగా నిర్మించిన అర్బన్ హెల్త్ క్లినిక్‌లను బుధవారం ప్రారంభించనున్నట్లు మున్సిపల్ కమిషనర్ వెంకటేశులు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి కేవీ ఉషశ్రీచరణ్ హాజరవుతారని పేర్కొన్నారు.